ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ. 31.12.2024 సమయం. 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. భద్రాచలం శ్రీరామ దివ్యక్షేత్రంలో ముక్కోటి ఏకాదశి ఉత్సవాలు ఈ ఉదయం ఘనంగా ప్రారంభమయ్యాయి. జనవరి 20 వరకు ఈ ఉత్సవాలు జరగనున్నాయి.

2. నూతన ఆంగ్ల సంవత్సరానికి స్వాగతం పలికేందుకు రాష్ట్ర ప్రజలు సిద్ధం అవుతుండగా  హైదరాబాద్ సహా అన్ని జిల్లాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు శాఖ కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపడుతోంది.

3. సంతోష్ ట్రోఫీ జాతీయ ఫుట్ బాల్ చాంపియన్ షిప్ లో భాగంగా ఈ రోజు రాత్రి హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో పశ్చిమ బెంగాల్ - కేరళ మధ్య ఫైనల్ మ్యాచ్ జరుగుతుంది.

4. రాష్ట్రంలో రాబోయే ఐదు రోజుల పాటు కొన్ని జిల్లాల్లో అక్కడక్కడ ఉదయం వేళల్లో పొగమంచు ఏర్పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

భద్రాచలం-ముక్కోటి ఏకాదశి

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం శ్రీరామ దివ్యక్షేత్రంలో ముక్కోటి ఏకాదశి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈరోజు నుంచి జనవరి 20 వరకు ఈ ముక్కోటి ఏకాదశి అధ్యయన ఉత్సవాలు వైభవంగా జరగనున్నాయి. ఈ ఉత్సవాలలో భాగంగా తొలిరోజున భద్రాద్రి రాముడు దశావతారాలలో ఒకటైన మత్స్య అవతారం లో భక్తులకు దర్శనమిస్తున్నారు. ప్రతి ఏటా జరిగే ఈ ఉత్సవాల కోసం అధికారులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

(PTC-B.KGM)

కొత్త సంవత్సరం

నూతన ఆంగ్ల సంవత్సరానికి పలికేందుకు స్వాగతం రాష్ట్ర ప్రజలు సిద్ధం అవుతున్నారు. ఈ రోజు రాత్రి జరిగే వేడుకల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా రాజధాని హైదరాబాద్ తో పాటు అన్ని జిల్లాల్లో పోలీస్ శాఖ కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపడుతోంది. హైదరాబాద్ నగరంలో వేడుకలు జరిగే హోటళ్లు, రెస్టారెంట్లు , పబ్బుల్లో మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టడానికి విస్తృత తనిఖీలు చేపడుతోంది. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం హైదరాబాద్ లో ఈరోజు రాత్రి 10 గంటల తర్వాత ఫ్లైఓవర్లను మూసివేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. విమానాశ్రయానికి వెళ్లే ప్రయాణికులకు మాత్రం తగిన ఆధారాలు చూపిస్తే PVNR ఫ్లైఓవర్ మీదకి అనుమతిస్తారు. అలాగే , ఎన్ టీ ఆర్ మార్గ్ ,

పీవీఎన్ఆర్ మార్గ్, అప్పర్ ట్యాంక్ బండ్ వైపు రాత్రి 10 గంటల నుంచి అర్ధరాత్రి 2 గంటల వరకు వాహనాల రాకపోకలను అనుమతించరు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు స్పష్టం చేశారు. మరోవైపు కొత్త ఏడాది వేడుకల సందర్భంగా రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ఈ రోజు రాత్రి 10 గంటల నుంచి ఒంటి గంట వరకూ హైదరాబాద్ , సైబరాబాద్, రాచకొండ పరిధిలో 500 కార్లు, 250 బైక్ టాక్సీలతో ఉచిత రవాణా సదుపాయం అందిస్తామని తెలంగాణ ఫోర్ వీలర్స్ సంఘం ప్రకటించింది. ఈ సర్వీసు కోసం 91776 24678 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించింది.

(డెస్క్)

రాచకొండ-సీపీ

నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో మద్యం తాగి రహదారుల పైకి వచ్చే వారిపై కేసులు నమోదు చేస్తామని రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు అన్నారు. ఆలేరు పోలీసు స్టేషన్ ను కమిషనర్ నిన్న రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. నేడు , రేపు వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. ఈ విషయంలో జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక పోలీసు నిఘా ఏర్పాటు చేస్తున్నామన్నారు. రహదారులపై సివిల్, ట్రాఫిక్ పోలీసు విభాగాల ఆధ్వర్యంలో 24 గంటలు తని ఖీలు చేపడతామని పేర్కొన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే ఎంతటి వారినైనా వదలబోమన్నారు.

(పీ టీ సీ యాదాద్రి భువనగిరి)

సింగరేణి-న్యూ ఇయర్ వేడుకలు రద్దు...

సింగరేణి వ్యాప్తంగా ఆరు జిల్లాల్లో నూతన సంవత్సర వేడుకలు రద్దు చేస్తున్నట్లు సింగరేణి సంస్థ సీ అండ్ ఎండీ బలరాం ప్రకటించారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం సంతాప దినాలుగా ప్రకటించిన నేపథ్యంలో సింగరేణి ఈ నిర్ణయం తీసుకుంది. ఈరోజు జరగాల్సిన వేడుకలను రద్దు చేస్తున్నట్లు శ్రీరాంపూర్ సింగరేణి సంస్థ అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

(పిటిసి, మంచిర్యాల జిల్లా)

నిర్మల్-ఎస్పీ

నిర్మల్ జిల్లాలో  నూతన సంవత్సర వేడుకలను ప్రజలందరూ ఈ రోజు సంతోషంగా జరుపుకోవాలని జిల్లా ఎస్పీ జానకి షర్మిల ఒక ప్రకటన లో తెలిపారు. ఈ రోజు రాత్రి నిర్మల్ జిల్లాలో నిర్మల్  , భైంసా, ఖానాపూర్ వంటి పట్టణాలతోపాటు అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.          మద్యం సేవించి వాహనాలు నడిపితే వాహనాలు సీజ్ చేయడంతోపాటు కేసులు నమోదు చేస్తామన్నారు.

(పిటిసి నిర్మల్ జిల్లా)

కేటీఆర్-ఫార్ములా ఈ రేసు

ఫార్ములా-ఈ కార్ రేసింగ్ వ్యవహారంలో తనపై నమోదైన కేసును కొట్టివేయాలని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు తారక రామారావు దాఖలు చేసిన పిటిషన్ పై హైకోర్టులో విచారణ జరుగుతోంది. ఎఫ్ఐఆర్ కొట్టి వేయాలంటూ తారక రామారావు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్ పై అవినీతి నిరోధక విభాగం –ఏసీబీ ఇప్పటికే కౌంటర్ దాఖలు చేసింది. కాగా, ఈ కేసులో తారక రామారావును అరెస్టు చేయకూడదంటూ న్యాయస్థానం ఇచ్చిన గడువు నేటితో ముగుస్తోంది.

(డెస్క్)

ట్రిపుల్ ఆర్- కలెక్టర్

ట్రిపుల్ ఆర్ టెండర్ల ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన నేపథ్యంలో భూసేకరణ సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రాంతీయ వలయ రహదారి భూసేకరణపై నేడు కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ జి.వీరారెడ్డితో కలిసి భూసేకరణ అధికారులతో సమీక్ష నిర్వహించారు. టెండర్లు నోటిఫికేషన్ జారీ అయినందున ఎన్ఏహెచ్ఎఐ విభాగానికి భూములు అప్పగించాల్సి వస్తుందని ఈలోపే భూసేకరణ ప్రక్రియ పూర్తి చేసి అవార్డులు సిద్ధం చేయాలని సూచించారు. నిర్మాణాలను కూడా సర్వే చేసి వాటి ధరను నిర్ధారించాలన్నారు. పరిహారం ధరల ఖరారు విషయంలో కొలిక్కి తేవాలని ఆదేశించారు.

(పీటీసీ యాదాద్రి భువనగిరి)

**సిరిసిల్ల-ఓటరు జాబితా**

ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల తుది జాబితాను, రాజన్న సిరిసిల్ల జిల్లా  కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ వెల్లడించారు  . జిల్లా పరిధిలో    874 మంది ఉపాధ్యాయ ఓటర్లు   , పట్టభద్రులు 21 వేల 614 మంది ఉన్నట్టు తెలిపారు.

**(పిటిసి రాజన్న సిరిసిల్ల జిల్లా)**

సంతోష్ ట్రోఫీ

సంతోష్ ట్రోఫీ జాతీయ ఫుట్ బాల్ చాంపియన్ షిప్ లో భాగంగా ఈ రోజు రాత్రి హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో పశ్చిమ బెంగాల్-కేరళ మధ్య ఫైనల్ మ్యాచ్ జరుగుతుంది. బెంగాల్ జట్టు ఈ టోర్నీలో ఫైనల్ చేరుకోవడం ఇది 47వ సారి. సెమీ ఫైనల్లో ఆ జట్టు 4-2 గోల్స్ తేడాతో సర్వీసెస్ జట్టుపై విజయం సాధించింది. మరోవైపు కేరళ 5-1 గోల్స్ తేడాతో మణిపూర్ జట్టు ను ఓడించి 16వ సారి ఫైనల్ చేరుకుంది. కాగా ,  ఈ టోర్నీకి   57  ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత హైదరాబాద్ ఆతిథ్యం ఇస్తోంది. చివరిసారిగా 1966-67 సీజన్‌లో ఈ టోర్నీని నిర్వహించింది.

డెస్క్

**వాతావరణం**

రాష్ట్రంలో రాబోయే వారం రోజుల పాటు పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. రాబోయే ఐదు రోజుల పాటు కొన్ని జిల్లాల్లో అక్కడక్కడ ఉదయం వేళల్లో పొగమంచు ఏర్పడే అవకాశం కూడా

ఉందని అంచనా వేసింది. రాబోయే మూడు రోజుల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీలకంటే ఎక్కువగా ఉండే అవకాశం ఉందని తెలిపింది.

(డెస్క్)

**సిరిసిల్ల అగ్నిపథ్**

భారత వాయు సేన అగ్నిపథ్ స్కీమ్ ద్వారా నిరుద్యోగ యువతకు క్లరికల్ , టెక్నికల్ కేడర్ లో , ఉద్యోగావకాశాలు ఉన్నాయని , రాజన్న సిరిసిల్ల జిల్లా యువజన సర్వీసుల అధికారి అజ్మీర రాందాస్ ఒక ప్రకటనలో తెలిపారు. నోటిఫికేషన్ జారీ అయిందని, అగ్నిపథ్ వెబ్ సైట్ లో రిజిస్ట్రేషన్లు జనవరి 7 నుంచి 25 వరకు కొన సాగుతాయన్నారు. ఆసక్తి గల యువత దర ఖాస్తు చేసుకోవాలని కోరారు.

(పీటీసీ, సిరిసిల్ల)

**ఆసిఫాబాద్ జిల్లా -ఎం.ఈ.వో.లకు షోకాజ్ నోటీసులు**

ఆసిఫాబాద్ జిల్లాలోని పాఠశాలల్లో మధ్యాహ్న భోజన బిల్లులతో పాటు ఇతర బిల్లుల ఆలస్యం నేపథ్యంలో జిల్లాలోని అన్ని మండలా ల విద్యాధికారులకు ఆర్జెడి షోకాజ్ నోటీసులు జారీ చేశారు . సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు గత 20 రోజులుగా సమ్మెలో ఉన్న నేపథ్యంలో మండల వనరుల కేంద్రంలో కంప్యూటర్ పనిచేయడానికి ఎవరూ లేకపోవడంతో బిల్లులు ఆలస్యం అయినట్లు మండల విద్యాధికారులు చెబుతున్నారు. ఇదే విషయంపై స్పందించిన ఉపాధ్యాయ

సంఘాలు షోకాజ్ నోటీసులను రద్దు చేయడంతో పాటు సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల సమ్మె విరమించేల ప్రభుత్వం కృషి చేయాలని కోరుతున్నారు.

(ఆసిఫాబాద్ జిల్లా పిటిసి)

**కామారెడ్డి-ఎస్పీ**

కామారెడ్డి జిల్లా అదనపుఎస్పీగా చైతన్య రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు సీఎస్ శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. త్వరలో ఆమె బాధ్యతలు స్వీకరించనున్నారు. గతంలో నిజామాబాద్ లో ట్రెయినీ ఐపీఎస్ గా పనిచేశారు.

(పిటిసి, రాజన్న సిరిసిల్ల జిల్లా)

శ్రీ రామ్ సాగర్ ప్రాజెక్ట్ - నీటి విడుదల

శ్రీరాం సాగర్ జలాశయం నుంచి ఇందిరమ్మ వరద కాలువకు 2,000 క్యూసెక్కుల నీటిని ఈ రోజు ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు విడుదల చేసినట్లు ఇరిగేషన్ శాఖ పోచం పాడు కార్యనిర్వాహక ఇంజనీర్ చక్రపాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపధ్యంలో కాలువ వెంబడి ఉన్న ప్రజానీకం అప్రమత్తం గా ఉండాలని విజ్ఞప్తి చేశారు.

(పిటీసీ, మంచిర్యాల జిల్లా)